క్లుప్తంగా

అభివృద్ధి పనులకు భూమి పూజ

నంద్యాల(సిటీ): పట్టణంలోని 14వ వార్డులో రూ.23.50లక్షలతో నూతన సీసీ రోడ్డు, డ్రైన్ల నిర్మాణానికి కౌన్సిలర్ విమల సోమశేఖర్‌రెడ్డి, చైర్‌పర్సన్ మాబున్నిసా భూమి పూజ చేశారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణాభివృద్ధి ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు.

కాలం చెల్లిన మందులు విక్రయిస్తే చర్యలు

రుద్రవరం: కాలం చెల్లిన పురుగు మందులు విక్రయించి రైతులను మోసగిస్తే కఠిన చర్యలు ఉంటాయని మండల వ్యవసాయాధికారి శ్రీకృష్ణ వ్యాపారులను హెచ్చరించారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సోమవారం మండలంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాదారులతో సమావేశం నిర్వహించారు.

సరుకులు అందజేయాలి

నంద్యాల(న్యూటౌన్): అంగన్‌వాడీ కేంద్రాలకు అవసరమైన సరుకులను ప్రభుత్వమే అందజేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగరాజు, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.నిర్మలమ్మ కోరారు. ఈ మేరకు సోమవారం స్పందనలో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

వసతులు కల్పించాలి

నంద్యాల(న్యూటౌన్): మహానంది మండలంలోని అబ్బీపురం గ్రామంలో పక్కా గృహాలు, వీధి లైట్లు, రోడ్ల నిర్మాణం, మహిళలకు మరుగుదొడ్లు తదితర మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

బాల కార్మికులను చదివిద్దాం

నంద్యాల(న్యూటౌన్): బాల కార్మికులను ప్రోత్సహించరాదని, బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ మాజీ సభ్యురాలు వై.రాజేశ్వరమ్మ అన్నారు. సోమవారం నందమూరినగర్‌లో ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. అలాగే..విద్యార్థులందరూ సభ్యత, సంస్కారం నేర్చుకోవాలని రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం శ్రీ రామకృష్ణ అటానమస్ కళాశాలలో బాల కార్మికుల దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు.

రుణ బకాయిలపై విచారణ

శిరివెళ్ల: లోకాయుక్త ఆదేశాల మేరకు వైఎస్సార్ క్రాంతి పథం అధికారులు మండలంలో విచారణ చేపట్టారు. సోమవారం యర్రగుంట్లలో రుద్రవరం మండల ఏపీఎం కల్పలత, లీగల్ కంప్లైంట్ కోఆర్డినేటర్ బాషా, స్త్రీనిధి మేనేజర్ ఫరూక్‌తో కూడిన బృందం ఉన్నతి, స్త్రీ నిధి రుణాల బకాయిదారులను విచారించి వివరాలు సేకరించారు. మండలంలో 70 సంఘాల మహిళలు ఉన్నతి రుణాలు రూ.11.54 లక్షలు, 120 సంఘాల మహిళలు రూ. 14.72 లక్షలు బకాయిలు చెల్లించలేదని తేలిందన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు చేయాలి

గోస్పాడు: గ్రామాల్లో నిర్వహించే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో గర్భిణులకు సరైన పరీక్షలు చేయించాలని నంద్యాల జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ప్రభావతి అన్నారు. మండలంలోని దీబగుంట్ల, కానాలపల్లె గ్రామాల్లో సోమవారం నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.

జ్వరాలతో ఉన్న వారిని గుర్తించాలి..

ఇంటింటి సర్వేలో భాగంగా ఆరోగ్య సిబ్బంది చేస్తున్న సర్వేలో జ్వరాలతో ఉన్న వారిని గుర్తించాలని నంద్యాల మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వరరెడ్డి సూచించారు. గోస్పాడు వైద్యాధికారి గోపాల్ ఆధ్వర్యంలో కానాలలో ఇంటింటి సర్వే నిర్వహించారు.

సూపర్‌వైజర్‌గా అనురాధ

శిరివెళ్ల: ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్‌గా అనురాధ నియమితులయ్యారు. గత సూపర్‌వైజర్ దస్తగిరమ్మ ఆళ్లగడ్డకు బదిలీ కావడంతో ఈ నియామకం జరిగింది. నూతన సూపర్‌వైజర్ పాణ్యం నుంచి బదిలీపై వచ్చారు.

మెరుగైన ఫలితాలు సాధిద్దాం

రుద్రవరం: విద్యార్థుల్లో క్రమశిక్షణ అలవర్చి మంచిగా విద్యా బోధన సాగించి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు కలిసి కట్టుగా పాటుపడదామని హెచ్ఎం మోహన్‌రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల బదిలీ అయ్యారు. ప్రాథమిక పాఠశాలల నుంచి 53 మంది ఇతర మండలాలకు బదిలీ కాగా 27 మంది రుద్రవరానికి వచ్చినట్లు ఎంఈఓ తెలిపారు. అలాగే స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉన్న వారిలో 10మంది ఉపాధ్యాయులు బదిలీ కాగా, 11 మంది కొత్తగా వచ్చారు.

వాహనాల స్వాధీనం

దొర్నిపాడు: డబ్ల్యూ గోవిందిన్నె పొలిమేరలోని శివప్రసాద్ అనే వ్యక్తి ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించకపోవడంతో పాటు అనుమతి లేకుండా మట్టి తరలిస్తుండగా దాడులు చేసినట్లు ఎస్ఐ తిరుపాల్ సోమవారం తెలిపారు. టిప్పర్లతో మట్టిని తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. అంకిరెడ్డిపల్లెకు చెందిన చిన్నహజప్ప, కొలిమిగుండ్లకు చెందిన సురేష్, కలుగొట్లకు చెందిన నాగేశ్వరరెడ్డి, అనంతపురం జిల్లా ఎల్లుట్లకు చెందిన రమణయ్య, తిమ్మనాయుడిపేటకు చెందిన మస్తాన్‌వలి, కనకాద్రిపల్లెకు చెందిన వీరశేఖర్‌రెడ్డి, జార్ఖండ్‌కు చెందిన ముఖేష్‌పాశ్వాను అదుపులోకి తీసుకొని వాహనాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

సద్వినియోగం చేసుకోండి

చాగలమర్రి: పాడి రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ పశుబీమా పథకాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ప్రాంతీయ పశువైద్య సహాయ సంచాలకులు వరప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక పశు వైద్యశాలలో మాట్లాడుతూ ఆవులు, గేదెలు, ఎద్దులు, మేకలు మొదలైన పశువులు ప్రమాద వశాత్తు కాని, అనారోగ్యంతో మరణిస్తే పథకం వర్తిస్తుందన్నారు.

మా పిల్లల పేర్లను ఒక్క రోజులోనే రేషన్ కార్డులో చేర్చారు



మా ఊరు మహదేవపురం. కొండకింద పల్లె. ఏ చిన్న పనికైనా మా ఊరు నుంచి శ్రీశైలం నియోజకవర్గంలోని గాజులపల్లె మెట్టకు నడుచుకుంటూ పోయి అక్కడి నుంచి నంద్యాల నియోజకవర్గం అయ్యలూరు మెట్టదగ్గర దిగి అక్కడి నుంచి శిరివెళ్ల మెట్టకు చేరుకొని అక్కడి నుంచి ఆటోలో శిరివెళ్లకు వెళ్లాలంటే కనీసం ఒక్కొక్కరికి రూ.300 ఖర్చు అయ్యేది. ఇటీవల మా కూతురు, కుమారుడికి అమ్మ ఒడి రావాలంటే రేషన్ కార్డులో పేర్లు ఉండాలని అధికారులు చెప్పారు. దీంతో గ్రామంలోని సచివాలయం వద్దకు వెళ్లి అర్జీ ఇస్తే అక్కడే కూర్చోమని సారోళ్లు చెబితే మధ్యాహ్నం పాటికి పేర్లు నమోదు చేసి కొత్త కార్డు తీసి ఇచ్చారు. గతంలో ఇలా ఉంటే చానా డబ్బులు మిగిలేవి. పనులు తప్పేవి కాదు.

– చాకలి పుల్లమ్మ, మహదేవపురం

గతంలో పనులు జరగక ఇబ్బందులు పడ్డాం



గతంలో పొలానికి సంబంధించిన పత్రాలు అవసరమవడంతో రెండు బస్సులు మారి సుమారు 30 కి.మీ. దూరంలోనున్న మండల కేంద్రం దొర్నిపాడుకు వెళ్లేవాళ్లం. వెళ్లిన సమయంలో సంబంధిత అధికారి లేకపోవడంతో ఇంటికొచ్చి అక్కడి అధికారులు చెప్పిన రోజు వెళ్లాను. అక్కడున్న అధికారికి ఆ రోజు ఏదో అర్జెంట్ పనిపై చేయాల్సిన పనులున్నాయి మరో రోజు రమ్మన్నారు. ఇలా మూడు రోజులు తిరిగినా పని పూర్తిగా కాలేదు. దీంతో కూలీ పనులు కోల్పోవడమే కాకుండా కూలి నష్టపోయేవాళ్లం. అలాగే రెండు మూడు రోజుల పాటు తిరగడానికి, తిండికి బాగానే ఖర్చయ్యేది. ఇక ప్రయాణ ఇబ్బందులు అదనం. వీటిన్నంటితో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ప్రస్తుతం గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేయడంతో ఊర్లోనే అన్ని పనులు చేస్తున్నారు. దీంతో మాకు వ్యయప్రయాసలు తప్పాయి.

– నాగన్న, గుండుపాల

సచివాలయాల్లో మెరుగైన సేవలు

సచివాలయల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయి. ప్రస్తుతం అన్ని రకాల సేవలు గ్రామ సచివాలయాల్లోనే అందుబాటులో ఉన్నాయి. వలంటీర్ల సాయంతో అన్ని పనులు సొంతూర్లోనే చేసుకోవచ్చు. ఏదైనా సర్టిఫికెట్ కావాలంటే ప్రభుత్వం నిర్ణయించిన ధర చెల్లించాలి. ఒక్క రూపాయి కూడా అదనంగా తీసుకోరు. రైల్వే టికెట్లు కూడా బుకింగ్ చేసుకోవచ్చు.

– మహబూబ్‌ఖాన్,ఎంపీడీఓ

అద్భుత వ్యవస్థ..ప్రజలకు తప్పిన అవస్థ

- సేవలకు చిరునామాగా గ్రామ, వార్డు సచివాలయాలు
- ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సేవలు
- 15 నిమిషాల నుంచి 72 గంటల్లోనే సమస్యకు పరిష్కారం
- సొంతూర్లోనే 560 రకాలకు పైగా సేవలు
- నియోజకవర్గంలో 81 వార్డు, 10 గ్రామ సచివాలయాలు
- ఇప్పటి వరకు అందిన వినతులు 4,62,141
- పరిష్కారమైనవి 4,61,647

సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మానసపుత్రికగా పేరుగాంచిన గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థ అద్భుతాలు సృష్టిస్తోంది. సమస్త పాలన, సేవలు పల్లె ముంగిట అందేలా రూపుదిద్దడంతో గ్రామీణులకు అవస్థలు తప్పాయి. గతంలో ప్రతి చిన్న పనికి మండల, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. నేడు ఆ పనులన్నీ గ్రామంలోనే పూర్తయ్యేలా ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయడంతో జనానికి పాలన మరింత చేరువవడమే కాకుండా లక్షలాది మందికి నూతనంగా ఉద్యోగాలు లభించాయి.



కోటకొండ గ్రామ సచివాలయం



ఆర్.కృష్ణాపురంలో ఆధార్ సేవలు పొందుతున్న దృశ్యం

ఆళ్లగడ్డ: మారుమూల కుగ్రామంలో ఉన్నా.. పట్టణంలో ఉన్నా.. ఒకే సమయంలో ప్రజలకు సత్వర సేవలు అందిస్తూ.. దేశానికే ఆదర్శంగా నిలిచింది సచివాలయ వ్యవస్థ. ఒక్క రూపాయి లంచం ఇవ్వకుండా, కాళ్లరిగేలా ఆఫీసుల చుట్టూ తిరగకుండా.. ఉన్న ఊళ్లోనే పనులు జరుగుతున్నాయి. మహాత్ముడి ఆశయ సాధనలో భాగంగా పాలనను ప్రజలకు చేరువ చేస్తూ గ్రామ, వార్డు సచివాలయాల్లో దాదాపు 560 రకాల సేవలను అందిస్తోంది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. సచివాలయంలోకి వెళ్లి సమస్యను వివరిస్తే 15 నిమిషాల నుంచి 72 గంటల్లో పరిష్కారం లభిస్తోంది. గ్రామ ముంగిటకే సేవలు అందుబాటులోకి తేవడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో..

మారుమూల గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఏ సమస్య వచ్చినా సుదూర ప్రాంతాల్లో ఉన్న మండలాలు, పట్టణాలు, జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సి ఉండేది. ప్రస్తుతం అన్ని గ్రామాలు, వార్డుల్లో సచివాలయాలు సేవలు అందిస్తున్న నేపథ్యంలో ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కారానికి నోచుకుంటున్నాయి. 2వేల కుటుంబాలకు ఒక సచివాలయం ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీరును నియమించడంతో సంక్షేమ పథకాలతో పాటు ప్రభుత్వ సేవలన్నీ వారి ముంగిట్లోనే అందుతున్నాయి.

ఒక్కో సచివాలయంలో 14 మందికి ఉద్యోగం..

ఒక్కో గ్రామ, వార్డు సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, ఇంజినీరింగ్ అసిస్టెంట్, అగ్రికల్చర్, హార్టికల్చర్, ఫిషరీష్, సెరికల్చర్, పశుసంవర్ధక శాఖ, వెల్ఫేర్, మహిళా పోలీస్ తదితర 14 మందిని వివిధ ప్రభుత్వ శాఖలకు అనుబంధంగా ప్రభుత్వం నియమించింది.

సేవలు ఇలా..

సమస్యతో సచివాలయానికి వస్తే నిర్ణీత వ్యవధిలో సేవలు పొందవచ్చు. సుమారు 560 సేవలు 15 నిమిషాల నుంచి మొదలు 72 గంటల్లోపు పరిష్కారం లభించేలా చర్యలు తీసుకుంటున్నారు.

మండలాల వారీగా సచివాలయాల వివరాలు

మండలం	సచివాలయాలు
ఆళ్లగడ్డ రూరల్	12
ఆళ్లగడ్డ టౌన్	10
చాగలమర్రి	17
దొర్నిపాడు	09
రుద్రవరం	16
శిరివెళ్ల	16
ఉయ్యాలవాడ	11
మొత్తం	81

1బీ, అడంగల్, ఆధార్, రేషన్‌కార్డు ప్రింట్, టైటిల్ డీడ్, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ సర్టిఫికెట్ కాపీ, విద్యుత్ కనెక్షన్, కేటగిరి మార్పు వంటివి ఐదు నుంచి 15 నిమిషాల్లోపే పూర్తవుతున్నాయి. ఇలా 47 సేవలు అప్పటికప్పుడు అందిస్తున్నారు. 150 రకాల సేవలు మాత్రం మూడురోజుల్లో (72 గంటల్లో) కచ్చితంగా పరిష్కరిస్తారు. మిగిలిన వాటికి మూడు రోజుల అనంతరం ఒక్కో సేవకు నిర్ణీత వ్యవధి ఉంది. అలాంటి సేవలకు ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు చేశారు.

పల్లెలకు నూతన శోభ..

గ్రామాల్లో సచివాలయాల వ్యవస్థ ఏర్పాటుకు పట్టణాల్లో మాదిరిగా నూతన కార్యాలయ భవనాలు, ఇంటర్‌నెట్, వసతులు సమకూర్చడంతో పల్లెలకు నూతన కళ తీసుకొచ్చాయి. ఉద్యోగుల హడావుడి, అధికారుల రాకపోకలు, నాయకుల సందర్శన ఇలా పల్లెలకు రాకపోకలు సైతం అధికమయ్యాయి.

ఉచితంగా కొన్ని..

నామ మాత్రపు రుసుముతో మరి కొన్ని సేవలు

కులం, ఓటీసీ, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు, ఆధార్ ఈకేవైసీ, ఇన్‌కం, 1బీ, అడంగళ్, ఎఫ్ఎంబీ, పట్టాదారు పాస్‌బుక్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, సదరం స్లాట్ బుకింగ్, తిరుపతి మరియు ముఖ్యమైన దేవాలయాల రూంల బుకింగ్‌కు, కొత్త రైస్‌కార్డు యాడింగ్, డెలిటింగ్, బర్త్, డెత్ సర్టిఫికెట్స్‌లు ఆధార్ నమోదు, పేరు, అడ్రస్ మార్పులతో పాటు రిజిస్ట్రేషన్‌ల సేవలు అందుతున్నాయి. అలాగే ఈసీ, డ్రైవింగ్ లైసెన్స్ స్లాట్ బుగింక్ చాలా సర్వీసులకు అందుతున్నాయి. ప్రస్తుతం రూ.40కే 1బీ, అడంగళ్, రూ.50కు క్యాస్ట్, ఇన్‌కం, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు ఇస్తున్నారు.

పరిష్కారమైన వినతులు

రెవెన్యూ	1,23,562
పౌర సరఫరాలు	84,950
పీఆర్ అండ్ ఆర్డీ	16,302
మున్సిపల్ పట్టణాభివృద్ధి	12,074
వ్యవసాయం, మార్కెటింగ్	8,912
వైద్యం, ఆరోగ్యం	5,913
స్కిల్ డెవలప్‌మెంట్	8,094
పశుసంవర్ధకం	2,598
విద్యుత్	2,983

వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శం

ఉయ్యాలవాడ: ప్రజలకు మెరుగైన సేవలతో పాటు సంక్షేమ పథకాలు నేరుగా ఇంటి వద్దకు అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ అధ్యక్షతన వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. సేవా వజ్ర అవార్డు పొందిన రుద్రనాథ్ రెడ్డి, హరి, సేవా రత్నకు ఎంపికైన హరిప్రసాద్, పెద్ద హుసేని, లక్ష్మి ఓబులేస్, సుమలత, గురులక్ష్మిలకు జెడ్పీటీసీ కసాని పుణ్యలక్ష్మిదేవి, మండల కన్వీనర్ బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, రైతు సలహా మండలి చైర్మన్ పోచా రాధాకృష్ణారెడ్డితో కలిసి ఉత్తమ పురస్కార సర్టిఫికెట్, బ్యాడ్జీ అందజేసి సత్కరించారు. అలాగే 132 మందికి సేవా మిత్ర పురస్కారాల సర్టిఫికెట్లను అందజేసి సన్మానించారు. ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ వలంటీర్లు రాబోవు రోజుల్లో మరింత మెరుగైన సేవలు అందించి గ్రామాల్లో ప్రత్యేక గుర్తింపు పొందాలని కోరారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు సత్తిగారి బాలిరెడ్డి, గగ్గిర వెంకటేశ్వర్లు, సర్పంచ్ మేకల ఓబులేస్, సింగిల్‌విండో అధ్యక్షుడు బుడ్డా విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ఉయ్యాలవాడలో వలంటీర్లను సన్మానిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

పేదల సొంతింటి కల నిజం చేయడమే లక్ష్యం

పేదల సొంతింటి కల నిజం చేయడమే లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం పని చేస్తుందని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని మాయలూరు గ్రామ సచివాలయంలో 822-1 సర్వే నంబర్‌లో జగనన్న కాలనీ లేఅవుట్‌లో 11 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను సర్పంచ్ జనపాల సాయిరెడ్డితో కలిసి పంపిణీ చేశారు. తహసీల్దార్ రవికుమార్, పంచాయతీ కార్యదర్శి సురేష్‌బాబు, ఉప సర్పంచ్ షేక్షావలిరెడ్డి, వీఆర్‌ఓ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.



బడి గంట మోగిస్తున్న దృశ్యం



విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న దృశ్యం



రుద్రవరంలో మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థినులు

బడి గంటలు మోగిన వేళ

- ఆర్భాటంగా పునః ప్రారంభమైన ప్రభుత్వ పాఠశాలలు
- విద్యార్థులకు జగనన్న విద్యా కానుక పంపిణీ

ఆళ్లగడ్డ: పాలకులు మారారు.. బడులు నూతన కళను సంతరించుకున్నాయి. కార్పొరేట్ బడులకు తీసిపోని స్థాయిలో వసతులు కల్పించడంతో పండుగ వాతావరణాన్ని తలపించేలా సోమవారం పాఠశాలలను పునఃప్రారమయ్యాయి. వేసవి సెలవులు ముగియడంతో విద్యార్థులు బడిబాట పట్టారు. తొలి రోజే అడ్మిషన్ల కోసం విద్యార్థుల తల్లిదండ్రులు చిన్నారులతో వచ్చిపాఠశాల ఆవరణలో నిరీక్షించారు.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా..

వేసవి సెలవులు అనంతరం బడి గంటలు గణగణమంటూ మోగగా విద్యార్థులు ఉదయమే యూనిఫాం ధరించి కేరింతలు కొడుతూ పాఠశాలలకు పరుగులు తీశారు. దాదాపు రెండు నెలలుగా మూగబోయిన పాఠశాలలు విద్యార్థుల రాకతో సందడి నెలకొన్నాయి. పాత తరగతి వదిలి కొత్త తరగతిలోకి వచ్చామనే సంతోషంతో గడిపారు.

తొలిరోజే పుస్తకాలు, యూనిఫాం..

గతంలో పాఠశాలలు ప్రారంభమై సగం కాలం ముగిసినా అవసరమైన మేర పుస్తకాలు అందేవి కావు. కానీ నేడు జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీలో భాగంగా పాఠశాల ప్రారంభమైన మొదటి రోజే విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, మూడు జతల యూనిఫాం క్లాతు అందజేశారు.

రుద్రవరం: వేసవి సెలవులు ముగియడంతో సోమవారం మండలంలోని 56 ప్రభుత్వ పాఠశాలల తలుపులు తెరుచుకున్నాయి.మండలంలోని వివిధ గ్రామాలకు విద్యార్థి బస్సులు నడిచాయి. విద్యార్థులకు ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దల సమక్షంలో జగనన్న విద్యా కానుకఅందజేశారు.అనంతరం జగనన్న గోరుముద్ద వడ్డించారు.

శిరివెళ్ల: విద్యార్థులకు జగనన్న విద్యా కానుకల పంపిణీ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. మండలంలోని 6,543 మంది విద్యార్థులకు కానుకలు అందజేశామని విద్యాశాఖాధికారులు తెలిపారు.

ఉయ్యాలవాడ : పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో సోమవారం మండలంలోని బోడెమ్మనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుకలను గ్రామ సర్పంచ్ బందెల సువర్ణ అందజేశారు. అలాగే స్థానిక మోడల్‌స్కూల్‌లో ప్రిన్సిపాల్ నూర్జహాన్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం వెంకటక్రిష్టారెడ్డి విద్యార్థులకు కానుకలు అందజేశారు.

అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

నంద్యాల(న్యూటౌన్): అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నంద్యాల మండలం చాపిరేవుల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయన ఇంటింటికీ వెళ్లి సచివాలయ వ్యవస్థ ద్వారా పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా.. వలంటీర్లు పథకాలకు సంబంధించి ఇంటి వద్దకు వచ్చి దరఖాస్తులు స్వీకరిస్తున్నారా లేదా అని తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయని, ఇవన్నీ కొనసాగాలంటే జగనన్న మళ్లీ సీఎంగా ఉండాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పురుషోత్తంరెడ్డి, సర్పంచ్ దేవి, ఎంపీటీసీ రత్నమ్మ, బిజ్జల శేఖర్‌రెడ్డి, ఎంపీపీ శెట్టి ప్రభాకర్, మార్కెట్‌యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, ఎంపీడీఓ సుగుణశ్రీ, నాయకులు బాలిరెడ్డి, మల్లికార్జునరెడ్డి, ఎర్రబోలు శివారెడ్డి, రామసుబ్బన్న, బసవేశ్వరరెడ్డి, దాల్‌మిల్ అమీర్ పాల్గొన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పారవి

అప్పల బాధ తాళలేక రైతు ఆత్మహత్య

ఉయ్యాలవాడ : మండలంలోని సర్వాయిపల్లె గ్రామంలో నంద్యాల శివరామిరెడ్డి (45) అనే రైతు అప్పుల బాధ తాళలేక ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు తెలిపారు. సోమవారం హెడ్ కానిస్టేబుల్ రఫీ తెలిపిన వివరాల మేరకు..గ్రామానికి చెందిన శివరామిరెడ్డి గ్రామంలో 11 ఎకరాలు కౌలుకు తీసుకుని మూడు సంవత్సరాలుగా పత్తి, మినుము, శనగ, తదితర పంటలు సాగు చేస్తుండేవాడు. పంట దిగుబడులు సరిగా రాక, సాగు కోసం చేసిన అప్పులు రూ.10 లక్షలు ఎలా తీర్చాలని ఆవేదనకు లోనయ్యాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య నంద్యాల వెంకటేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ వివరించారు.

సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం

చాగలమర్రి: సంక్షేమ పథకాలు, అభివృద్ధికి జగనన్న సమప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక సచివాలయం-1 పరిధిలోని 2వ వార్డు చింతల చెరువు రస్తాలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి పథకాలు సక్రమంగా అందుతున్నాయా? పాలన బాగుందా? వలంటీర్లు బాగా పనిచేస్తున్నారా? సమస్యలు ఏవైనా ఉన్నాయ? అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగాలంటే జగనన్నను సీఎంగా మళ్లీ గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు షేక్.బాబులాల్, జి.కుమార్ రెడ్డి, ఎంపీపీ వీరభద్రుడు, ఉప సర్పంచ్ మహమ్మద్ సోహెల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జాబీర్, ఎంపీటీసీలు పత్తి నారాయణ, లక్ష్మీరెడ్డి, ఫయాజ్, వార్డు మెంబర్లు బురాందీన్, ఆర్ఎస్ రమణ, పాలక్కాయల బాబు, సింగిల్ విండో అధ్యక్షుడు దస్తగిరి, గణేష్ రెడ్డి, వెంకటరమణ, మహమ్మద్ రఫీ, తహసీల్దారు విజయకుమార్, ఎంపీడీఓ మహబుబ్ దౌలా, ఏఓ రంగ నేతాజీ, ఏఈలు షాజహాన్, కొండారెడ్డి, షఫీవుల్లా, ఈఓ సుదర్శనరావు పాల్గొన్నారు.



చాగలమర్రిలో పథకాల గురించి మహిళకు వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

మోటర్ సైకిళ్లు ఢీ.. ఒకరికి గాయాలు

రుద్రవరం: మండల కేంద్రం సమీపంలో సోమవారం రెండు మోటార్ సైకిళ్లు ఢీ కొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. దళిత కాలనీకి చెందిన చిన్న మౌలాలి పొలం పనుల్లో భాగంగా దొర్వి నరసింహస్వామి ఆలయం వైపు మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా బెస్త కాలనీకి చెందిన ఇద్దరు యువకులు బైక్‌పై దొర్వి నుంచి గ్రామం వైపు వెళ్తున్నారు. దారి మధ్యలో ప్రమాద వశాత్తు ఎదురెదురుగా ఢీ.కొన్నాయి. దీంతో చిన్న మౌలాలి తలకు రక్త గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం నంద్యాలలోని ఓ వైద్యశాలకు తరలించినట్లు కాలనీ వాసులు తెలిపారు.

ఈఓఆర్డీగా నాగేశ్వరరావు

శిరివెళ్ల: ఈఓఆర్డీగా నాగేశ్వరరావు నియమితులయ్యారు. గతంలో ఇక్కడున్న ఈఓఆర్డీ ఎంపీడీఓగా పదోన్నతిపై అనంతపురం జిల్లాకు బదిలీ కావడంతో ఈ నియామకం జరిగింది. నూతన ఈఓఆర్డీ గోస్పాడు నుంచి బదిలీపై వచ్చారు.

వ్యక్తి అరెస్ట్

ఆళ్లగడ్డ: అనుమానాస్పదంగా తిరుగుతూ మారణాయుధాలతో పట్టుబడిన హుసేన్‌బాషా అనే వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ రమేష్‌బాబు సోమవారం తెలిపారు. పట్టణ శివారులోని గోడౌన్ల సమీపంలో ఎస్ఐ తిమ్మయ్య అదుపులోకి తీసుకుని సోదా చేయగా పిడిబాకు లభించింది. తమదైన శైలిలో విచారించగా.. తనది నంద్యాల అని, తన ప్రత్యర్థులు నంద్యాల సబ్‌జైలులో ఉన్నారని, వారితో తనకు ప్రాణహాని ఉండొచ్చని ఆత్మరక్షణ కోసం పిడిబాకు ఉంచుకున్నట్లు చెప్పాడు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ వివరించారు.

ఈ -ఆటోలు మంజూరు

ఆళ్లగడ్డ: మున్సిపాలిటీకి మంజూరైన ఐదు ఈ-ఆటోలు సోమవారం ఆళ్లగడ్డకు చేరుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీల్లో స్వచ్ఛత, పరిశుభ్రత కోసం కేటాయించిందని కమిషనర్ రమేష్ బాబు తెలిపారు. గృహాల నుంచి చెత్త సేకరణ కోసం వీటిని ఉపయోగించుకుంటామని చెప్పారు.

నివాళి

చాగలమర్రి: స్థానిక చిన్నమకానం వీధికి చెందిన విశ్రాంత ఈఓ ముల్లా అన్వర్ బాషా (74) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి మృత దేహాన్ని సందర్శించి పూలమాల ఉంచి నివాళులర్పించారు.

17న బియ్యం వేలం

నంద్యాల(న్యూటౌన్): సీజ్ చేయబడిన బియ్యాన్ని ఈనెల 17వ తేదీన వేలం వేస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ నిశాంతి సోమవారం సాయంత్రం తెలిపారు. ఆమె మాట్లాడుతూ నంద్యాల స్టాక్ పాయింట్ వద్ద సుమారు 4593.48 క్వింటాళ్ల బియ్యాన్ని బహిరంగ వేలం వేస్తామన్నారు. నంద్యాల 1969.95 క్వింటాళ్లు, ఆళ్లగడ్డ 336.93 క్వింటాళ్లు, నందికొట్కూరు 585.80, కోవెలకుంట్ల 802.60, ఆత్మకూరు 151.55, డోన్ 525.10, రుద్రవరం 221.55 క్వింటాళ్ల బియ్యం ఉన్నాయని, వేలంలో పాల్గొనే వారు రూ.10 లక్షలు డీడీ రూపంలో డిస్ట్రిక్ట్ సివిల్ సప్లయిస్ మేనేజర్, ఏపీఎస్ఎస్‌సీఎల్, నంద్యాల వారిపేరున చెల్లించాలన్నారు. 14 నుంచి 16తేదీన సాయంత్రం లోపు డీడీ సమర్పించాలని సూచించారు.

సామాజిక తనిఖీ సభ

చాగలమర్రి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో సోమవారం ఎంపీపీ వీరభద్రుడు అధ్యక్షతన 17వ సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా అడిషనల్ పీడీ సలీం బాషా, ఏపీడీ సాంబశివుడు హాజరయ్యారు. 2022-23లో రూ.7.18 కోట్ల ఉపాధి పనులపై 10 రోజుల పాటు సామాజిక తనిఖీ చేశారని ఏపీఓ నిర్మల తెలిపారు. తనిఖీల్లో మొత్తం రూ.1.15 లక్షల అవినీతి బయట పడగా రికవరీకి ఆదేశించారు.

పిల్లలను పనిలో పెట్టుకోవడం నేరం

నంద్యాల(సిటీ): చిన్న పిల్లలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని, అలాంటి సంస్థలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ కార్మిక శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని కార్మిక శాఖ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి 'ప్రపంచ బాల కార్మిక నిర్మూలన వ్యతిరేక అవగాహన ర్యాలీని' ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు, సంక్షేమశాఖ డీడీ చింతామణి, డ్వామా పీడీ రామచంద్ర రెడ్డి, ఎంఈఓ బ్రహ్మం నాయక్, కార్మిక శాఖ సహాయ కమిషనర్ బషీరున్నిసా బేగంపాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ శామూన్, ఏఎస్పీ వెంకటరాముడు

కుష్టు వ్యాధిని గుర్తిద్దాం

నంద్యాలటౌన్: కుష్టు వ్యాధి గుర్తింపు కార్యక్రమం పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ సూచించారు. సోమవారం కరపత్రాలు, పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ బాలాజీ మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి జూలై 16వ తేదీ వరకు కుష్టు వ్యాధిని గుర్తింపు జరుగుతందని తెలిపారు.

ధర్మాన్ని ఆచరించాలి

ఆళ్లగడ్డ ప్రతి ఒక్కరూ ధర్మాన్ని ఆచరించాలని సరమత సేవా ఫౌండేషన్ వక్తలు శివరామకృష్ణ, దాసరి శ్రీనివాసులు, నాగమోహన్‌రెడ్డి తెలిపారు.మండల కమిటీ శిక్షణ తరగతులు సోమవారం స్థానిక శ్రీ కోదండ రామాలయంలో ప్రారంభించారు.